నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మరమ్మతుల కారణంగా గగన్ పహాడ్ సెక్షన్ పరిధితో పాటు కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మశాలీపురం ఫీడర్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పద్మశాలీపురం, మధుబన్‌కాలనీ, ఆప్కో కాలనీలు. అలాగే శివాజీనగర్ ఫీడర్, శివశక్తి ఫీడర్, అక్షయ ఫుడ్ ఫీడర్, పహేల్ ఫుడ్ ఫీడర్లలోని శివాజీనగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, ఐజీహెచ్‌ఎస్ ఇండస్ట్రీయల్ ఏరియా తదితర ప్రాంతాలు.

కాటేదాన్‌లో..

కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్ ఫీడర్–2లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విశ్వకర్మ ఇంజినీరింగ్ కాలేజీ, బ్యాటరీ కంపెనీ, బాసప్ప హోటల్ లేన్, హనుమాన్ ఆలయం ప్రాంతం, మినార్ హోటల్, స్వప్న థియేటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

బోనాలకు ఇబ్బందులు్లేకుండా చూడాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అమ్మవారి ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వేముల మల్లేశ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. భవానీకాలనీలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల వద్ద వీధి దీపాల ఏర్పాటుతో పాటు పారిశుద్ధ పనులు చేపట్టాలన్నారు. అలాగే రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు. రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టాలని విన్నవించారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీవాసులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తిరుమలహిల్స్ కాలనీలో రూ. 35 లక్షల వ్యయంతో రోడ్ల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు హరీశ్‌గౌడ్, కాలనీ వైస్ ప్రెసిడెంట్ సంజీవ, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, కాలనీవాసులు జ్ఞానేశ్వర్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కారంలో ‘గ్రామీణ అవగాహన-పని అనుభవం’




కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో ‘గ్రామీణ అవగాహన–పని అనుభవం’ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ మూల్యాంకనం చేశారు. వివిధ అంశాలను పటాల రూపంలో చిత్రీకరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు, శాస్త్రవేత్తలు పి.జానకీ శ్రీనాథ్, శిరీషా దీప్తి, ప్రశాంతి ఆలం, స్నేహలత, గాయత్రి, స్పందన, సుష్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

గచ్చిబౌలి: దాడి కేసులో రాయదుర్గం పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. ఈనెల 8న అర్ధరాత్రి నాలెడ్జీ సిటీలో ఇషా హోటల్ వద్ద ఉన్న యూటర్న్ విషయంలో సోమాలియాకు చెందిన అహ్మద్ (25) కు పలువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో అహ్మద్‌ను కడుపులో కత్తితో పొడిచి నిందితుడు పరారైన విషయం తెలిసిందే. 2 బైక్‌లపై వచ్చిన నలుగురు యువకుల కోసం రాయదుర్గం పోలీసులు గాలింపు చేపట్టారు. బాలానగర్‌కు చెందిన అనీష్ (26)ను శనివారం అరెస్ట్ చేశారు. కత్తితో దాడి చేసిన యువకుడితో పాటు మరో ఇద్దరు యువకుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గాయపడిన అహ్మద్ మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



మణికొండ: మున్సిపాలిటీలోని లాలమ్మ గార్డన్ 4 వీధిలో వరద నీరు వెళ్లేందుకు డ్రైనేజీ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నీరు నిలిచే చోట మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేశారు. అవి ఇనుపవి కావడం, మరోవైపు భారీ వాహనాలు వాటిపై నుంచి వెళ్తుండడంతో అవి కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి నూతన మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘట స్థాపన ఊరేగింపునకు సర్వం సిద్ధం

- నేడు పాతబస్తీలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ
- లాల్‌దర్వాజ మోడ్ వద్ద స్వాగత వేదిక
- ఉజ్జయినీ బోనాలప్పుడే పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన ఊరేగింపు



శాలిబండలోని కాశీవిశ్వనాథ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు



మీరాలంమండిలో శుక్రవారం రాత్రి జరిగిన ఘట స్థాపన ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసింది. పాతబస్తీ ప్రధాన సామూహిక ఊరేగింపునకు రెండు రోజుల ముందుగా..అంటే శుక్రవారం రాత్రి మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మాతేశ్వరి ఘట స్థాపన ఊరేగింపు కొనసాగింది. ఇక ఆదివారం పాతబస్తీలోని 22 ఆలయాలకు చెందిన అమ్మవారి ఘటాల ప్రతిష్టాపన ప్రధాన ఊరేగింపు జరుగనుంది. ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో బోనాల జాతర రోజే..పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపును ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఊరేగింపు బయలుదేరడానికి ఉత్సవాల నిర్వాహకులు సిద్ధమయ్యారు.

కాశీ విశ్వనాథ ఆలయం నుంచి..

శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటుంది. లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదిక పైనుంచి పలువురు ప్రముఖులు ఘటాలకు స్వాగతం పలుకుతారని ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకనున్నారన్నారు.

అమ్మవారి ఘటాలు ఇవే..

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఘటం, ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఘటం, గౌలిపురా మహంకాళి మాతేశ్వరీ అమ్మవారి ఘటం, సుల్తాన్‌షాహి జగదాంబ మహంకాళి అమ్మవారి ఘటం, మురాద్‌మహల్ మహంకాళి అమ్మవారి ఘటం, సుల్తాన్‌షాహి బంగారు మైసమ్మ అమ్మవారి ఘటం, గౌలిపురా నల్ల పోచమ్మ అమ్మవారి ఘటం, రాంబక్షి బండ అమ్మవారి ఘటం, బేలా ముత్యాలమ్మ అమ్మవారి ఘటం, హరిబౌలి బంగారు మైసమ్మ అమ్మవారి ఘటం, హరిబౌలి అక్కన్నమాదన్న అమ్మవారి ఘటం, రాంసింగ్‌బడా బంగారు మైసమ్మ మహంకాళి ఘటం, మక్తూంపురా ఎల్లమ్మ అమ్మవారి ఘటం, సుల్తాన్‌షాహి రేణుకా ఎల్లమ్మ ఘటం, గౌలిపురా బంగారు మైసమ్మ ఘటం, మేకలబండ నల్లపోచమ్మ, మీర్‌చౌక్ బంగారు మైసమ్మ ఆలయాలకు చెందిన 22 అమ్మవారి ఘటాలు భక్తుల కోలాహలం నడుమ ముందుకు కదలనున్నాయి.

20న అమ్మవారికి బోనాల సమర్పణ..

పాతబస్తీలోని ప్రధాన ఆలయాల అమ్మవారి ఘట స్థాపన ఉత్సవాల అనంతరం ఈ నెల 20న అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. 18న విజయవాడ కనక దుర్గమ్మ తల్లి దేవస్థానం నుంచి పాతబస్తీలోని ప్రధాన అమ్మవారి ఆలయాలకు పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, చలివిడి సమర్పించనున్నారు. ఆలయ ఈఓ సీనా నాయక్ ఆధ్వర్యంలోని వేద పండితులు పాతబస్తీకి రానున్నారు. ఇక బోనాల సమర్పణ అనంతరం 21న పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించనున్నారు. ఊరేగింపు అనంతరం మరుసటి రోజు అమ్మవారికి సమర్పించే మారుబోనంతో పాతబస్తీలో ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ముగియనున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నేతలు

శంషాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పక్షపాతిగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, డీసీసీ అధికార ప్రతినిధి మైలారం సులోచన, శేఖర్‌యాదవ్, అక్రమ్‌ఖాన్, నజీరుద్దీన్, లింగం యాదవ్, శ్రీధర్ యాదవ్ పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం వద్ద..



మణికొండ: వట్టినాగులపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు శిశుపాల్‌సింగ్ ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలోని వార్డు కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కే శేఖర్, బీ అరుణ్‌కుమార్, తారాసింగ్, మల్లేశ్‌యాదవ్, కృష్ణ యాదవ్, దర్శన్, లక్ష్మణ్‌రెడ్డి, యాదగిరి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా చెరువుల సుందరీకరణ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు, సహే ఎన్‌జీఓ కల్పనారమేశ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను దశలవారీగా సుందరీకరిస్తున్నామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీపేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీద్‌బండలోని కుడికుంట చెరువుల సహే ఎన్‌జీఓ కల్పన రమేశ్‌తో కలిసి, ఇన్ఫోసిస్ సంస్థ సౌజన్యంతో చేపట్టే సుందరీకరణలో భాగంగా శనివారం చెరువు కట్టపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల సుందరీకరణతో జీవవైవిధ్యం పెరగడమే కాకుండా పక్షుల వలసలు మొదలవుతాయని పేర్కొన్నారు. సహే ఎన్‌జీఓ కల్పన రమేశ్ మాట్లాడుతూ..ఇన్ఫోసిస్ సంస్థ కృషితో కుడికుంట చెరువు దశ మారిందన్నారు. అనంతరం కల్పన రమేశ్, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి కేసులో ఇద్దరి రిమాండ్



దాడికి పాల్పడిన నిందితులు

అత్తాపూర్: డెలివరీ బాయ్‌పై దాడి కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రేహాన్ (20) పీవీఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 208 సమీపంలో జీప్టో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సులేమాన్ (25), యూనస్ (25)ను తోడుగా తీసుకువచ్చాడు. ఫుడ్ డెలివరీ చేసేందుకు ఆర్డర్లు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో మరో వ్యక్తిని ఎందుకు తీసుకువచ్చావు అని రేహాన్ సులేను ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మరో ఇద్దరు స్నేహితులు ఇమ్రాన్ (25) సలీం (22) పిలిచాడు. నలుగురు కలిసి రేహాన్‌పై దాడి చేయడంతో పాటు పదునైన కత్తితో ఎడమ చేయి, ఎడమ కాలుపై గాయాలు చేసి పారిపోయారు. రేహాన్‌ను చికిత్స కోసం ఉస్మానియాకు తరలించారు. రేహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన సునీల్ (19) పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. శనివారం ఉదయం తల్లి చదువుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన సునీల్ ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. అనుమానంతో కుటుంబ సభ్యులు డోర్ తెరిచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత..

గచ్చిబౌలి: యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీకాకుళం జిల్లా జలమూరు మండలం సావిరిగం గ్రామానికి చెందిన అప్పల నాయుడు, అంకోలు రమా (21) దంపతులు. వీరు బతుకుదెరువు కోసం రాయదుర్గానికి వలస వచ్చారు. మల్కం చెరువు ఎదుట గుడిసెలో నివాసం ఉంటూ నర్సరీలో పని చేస్తున్నారు. శుక్రవారం రమా కడుపునొప్పిగా ఉందని తల్లి మంజులకు చెప్పి ఇంటి వద్దే ఉంది. తల్లి, భర్త మధ్యాహ్నం వచ్చి చూడగా నోట్ల నుంచి నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నది. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. కడుపు నొప్పి కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గృహిణి ..

గచ్చిబౌలి: గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం .. పంచవటి కాలనీలో కాంతా (24) భర్త అరుణ్ చౌదరితో కలిసి ఉంటోంది. గురువారం కృష్ణానగర్‌లో తల్లిగారి ఇంటివద్ద పూజకు వెళ్లి వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో పురుగుల మందు తాగడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రైనీ ఐపీఎస్‌ల పీఎస్‌ల సందర్శన

గచ్చిబౌలి: ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ట్రైనీ ఐపీఎస్‌లు పోలీస్ స్టేషన్లను శనివారం సందర్శించారు. గచ్చిబౌలి, రాయదుర్గం పీఎస్‌లో నలుగురు చొప్పున ట్రైనీ ఐపీఎస్‌లకు రిసెప్షన్, రికార్డులు, లాకప్, సీసీ కెమెరాల పరిశీలన ఎలా ఉంటుందో ఎస్‌హెచ్‌ఓలు వారికి వివరించారు. డయల్ 100 తో పాటు పీఎస్‌లకు ఫోన్లలో ఎలా ఫిర్యాదు చేస్తారు, పెట్రోల్ మొబైల్ సిబ్బంది ఎలా స్పందిస్తారు, ఎఫ్‌ఐఆర్‌ల నమోదు, హోంగార్డు, కానిస్టేబుల్ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు వారు నిర్వహించే విధులను క్షుణ్ణంగా వివరించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గంధంగూడలోని ఇండస్ వాయుకాలనీలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును చెన్నారెడ్డితో కలిసి నిర్వాహకులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వినయ్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాములునాయక్, కోశాధికారి రామ్‌రెడ్డి, సభ్యులు రాజేందర్, బాలేంత్‌రావు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివరాంపల్లిలోని రాందేవ్‌బాబా ఆలయం వద్ద..

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని రాందేవ్‌బాబా ఆలయం వద్ద ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి రూ.27 లక్షల విలువైన 79 చెక్కులను ఆలయ కమిటీల ప్రతినిధులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ ఈవో రమాదేవి, సిద్ధులగుట్ట ఈవో రామశర్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

అత్తాపూర్: బోనాల ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌కు చెందిన ఆలయాల నిర్వాహకులకు శనివారం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిద్దెల సురేందర్‌రెడ్డి, మిద్దెల సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ముగిసిన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులతో ప్రిన్సిపాల్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో ఈనెల 7న ప్రారంభమైన క్వాంటమ్ కంప్యూటింగ్ ఫౌండేషన్స్, అప్లికేషన్స్‌పై అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణలతో అధ్యాపకులకు అధునాతన సాంకేతికతపై అవగాహన ఏర్పడుతుందని దీనిని విద్యాబోధనలో ఉపయోగించుకోవాలన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు, ఐటీ సంస్థల నుంచి రిసోర్స్ పర్సన్లు హాజరై క్వాంటమ్ కంప్యూటింగ్ బేసిక్స్, ఫండమెంటల్స్, అప్లికేషన్స్ వంటి అంశాలపై విలువైన సమాచారం తెలిపారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ జె.శ్రీదేవితో పాటు పలు కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: మార్కండేయనగర్ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ నిర్మించాలని కోరుతూ రాజేంద్రనగర్ మండల సీపీఎం కార్యదర్శి జాజాల రుద్ర కుమార్, సభ్యుడు పి.సి.కె. భాస్కర్ ఆధ్వర్యంలో మార్కండేయనగర్ బాబుల్ రెడ్డినగర్ రోడ్డు క్రాసింగ్ వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్ర కుమార్ మాట్లాడుతూ.. ఆయా బస్తీల్లోని ప్రజలు స్థానికంగా కాటేదాన్ పారిశ్రామికవాడలో కూలీలుగా పనులు చేసుకుంటున్నారన్నారు. నిత్యం పనులకు పోవాలన్నా..రోడ్డు దాటాలన్నా.. ఆరాంఘర్‌కు వెళ్లాలన్నా.. రోడ్డు క్రాస్ చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ క్రమంలో వాహన ప్రమాదాలు జరిగి కార్మికులు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిచాలని లేకుంటే బస్తీవాసులను ఐక్యం చేసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల సీపీఎం కమిటీ సభ్యులు బి.వెంకటయ్య, కాలే రాజు, నర్సాబాయి, మనమ్మ, అమృత, ఈశ్వరి, వెంకట్‌రెడ్డి, జహంగీర్, రాజునాయక్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు పోచమ్మ ఆలయం ముస్తాబు



ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

మణికొండ: మున్సిపాలిటీ కేంద్రంలోని పోచమ్మ ఆలయం బోనాలకు ముస్తాబవుతోంది. మున్సిపాలిటీతో పాటు ఆలయాల అభివృద్ధి కమిటీ, పలువురు దాతలు ముందుకు రావడంతో ఆలయం చుట్టూ ప్రహరీతో పాటు ఆవరణలో ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసేందుకు గ్రామ ఆలయాల అభివృద్ధి కమిటీ నుంచి రూ.2 లక్షలు వెచ్చించిన విషయం తెలిసిందే. రానున్న రోజుల్లో ఆలయాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు మరికొంత మంది దాతలు ముందుకురావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.



ఆలయ ఆవరణలో ఫ్లోరింగ్

మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో ‘విజిబుల్ పోలీసింగ్’



కాటేదాన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ‘విజిబుల్ పోలీసింగ్’ను నిర్వహించారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ పాల్గొని లాడ్జీలు, హోటల్స్, భారీ వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, కాటేదాన్ స్వప్న థియేటర్ వద్ద వాహనాల తనిఖీలు, ట్రాఫిక్ విభాగంతో కలిసి డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో ప్రతిరోజు వాహనాల తనిఖీలతో పాటు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్, నిషేధిత గుట్కాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని అలా చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జైలుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులతో పాటు ప్రత్యేక సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 కోట్ల రుణ మంజూరు పత్రాల పంపిణీ



రుణ మంజూరు పత్రాల పంపిణీలో బ్యాంక్ అధికారులు తదితరులు

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముచ్చింతల్ శివారులో గల స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో గ్రామీణ స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ, పౌల్ట్రీ రంగాల వారికి రూ.50 కోట్ల రుణాల మంజూరు పత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు, మిల్లెట్ ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. అలాగే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేశ్ రంజన్, సీజీఎం–వన్ సుధాకర్‌రావు, హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ సర్వేష్ రంజన్, సైఫాబాద్ రీజినల్ హెడ్ సోనాలికా తదితరులు పాల్గొన్నారు.